# శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగకేంద్రానికి 'వంద'నం



శ్రీహరికోట (తడ), జనవరి 24 ప్రభాతవార్త : ఈనెల 29న జిఎస్ఎల్వి-ఎఫ్ 15 రాకెట్ ప్రయోగం నావిగేషన్ సేవల కోసం ఎన్విఎస్-02 ఉపగ్రహం ఎస్ఎల్వితో మొదలై ప్రస్తుతం శత ప్రయోగానికి దూసుకొచ్చిన షార్. రెండో ప్రయోగ వేదిక నుండి ఈనెల 29వ తేదీ ఉదయం 06:23 గంటలకు ప్రయోగం నిర్వహించనున్నారు. ఉపగ్రహం బరువు 2250 కిలోలు, రాకెట్ బరువు 420.7 టన్నులు, ఎత్తు 50.9 మీటర్లు అని షార్ అధికారులు తెలిపారు.

తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త



## చిన్నారి విషయాన్ని...
# రాజకీయం చేయకండి

**- ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటాం - చిన్నారి విషయాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుంది - వైద్య పరీక్షల అనంతరమే అన్ని విషయాలు ప్రకటిస్తాం -చిన్నారి ఆరోగ్యాన్ని పరామర్శించిన ఎంపీ**

తిరుపతి హెల్త్, జనవరి 24 ప్రభాతవార్త : చిత్తూరు జిల్లా నగరి మండలం కావేటిపురం దళితవాడలోని ఓ చిన్నారి లైంగిక వేధింపులకు గురై తిరుపతి ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఆ చిన్నారి చికిత్స పొందుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ఆస్పత్రిని సందర్శించి ఆ చిన్నారి ఆరోగ్యాన్ని గురించి ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నగరి నియోజక వర్గంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలు చేపడతామన్నారు. మానవీయ కోణంలో చూడాల్సిన చిన్నారి విషయాన్ని రాజకీయం చేయడం సబబు కాదన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంద న్నారు. చిన్నారి విషయాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని, చిన్నారిపై హత్యాచారం జరిగిందా... లేదా...? అనే విషయాన్ని వైద్యుల వైద్య పరీక్షల అనంతరం వెల్లడిస్తామన్నారు. అలాగే చిన్నారిపై జరిగిన లైంగిక వేధింపులకు దారితీసిన అంశాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పినట్లు తెలిపారు. అంతే కాకుండా నగరి డీఎస్పీ అజీజ్‌తో సమావేశమై నిందితుడిని కఠినంగా శిక్షించాలని, బాధితులకు అండగా నిలవాలని, వారికి న్యాయం జరిగేలా చూడాలసి సూచించినట్లు వెల్లడించారు. ఆర్థిక నష్టపరిహారంపై ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధా నంగా ఈ విషయంపై త్వరలో సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పం దించి మాట్లాడుతారు అన్నారు. చిన్నారి తల్లిదండ్రులను ఎవరూ గ్రామంలో అడ్డగించలేదని, బాధిత కుటుంబానికి పోలీసులు రక్షణగా ఉంటారని తెలిపారు. కావేటిపురం గ్రామంలో శాంతి భద్రతలు అదుపులోని ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో ఆర్.ఆర్‌రెడ్డి, డాక్టర్ల బృందం పాల్గొన్నారు.





విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ దగ్గుమళ్ళ

## విధుల నిర్వహణలో ఆలసత్వం వహిస్తే ...
# కఠిన చర్యలు

**- ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా విధులు - రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమీషనర్ వీరపాండియన్**

చిత్తూరు, జనవరి 24 ప్రభాతవార్త: క్షేత్ర స్థాయిలో విధి నిర్వహణలో వైద్య ఆరోగ్య అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమీషనర్ వీరపాండియన్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమీషనర్ వీరపాండియన్ కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో మాతా శిశు సంరక్షణ, ఆసుపత్రుల భవన నిర్మాణాలు, ఎలక్ట్రానిక్ హెల్త్‌రికార్డ్స్ తదితరాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమీషనర్ వీరపాండియన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి క్షేత్ర స్థాయిలో మెరుగైన వైద్యం అందించడానికి అత్యధిక నిధులు ఖర్చు చేస్తోందన్నారు. జిల్లా అధికారులు క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే సిబ్బంది పనితీరును నిరంతరం పరిశీలించి పర్యవేక్షిం చాలన్నారు. ఆసుపత్రులకు వైద్యం కోసం వచ్చే రోగుల నిమిత్తం ఓపి రిజిస్టర్‌ను పక్కాగా నిర్వహించాలన్నారు. ప్రతి వ్యక్తికి సంబంధించి వైద్య సేవల కోసం అబా కార్డును ప్రభుత్వం అందిస్తోందని, అబా కార్డుల రిజిస్ట్రేషన్‌ను వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఒక మహిళ గర్భం దాల్చినప్పటి నుండి ప్రసవం అయిన తరువాత వరకు తల్లి, బిడ్డ ఆరోగ్య పరిస్థితులపై ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు నిరంతరం పర్యవేక్షిం చాలన్నారు. అనునిత్యం వైద్యాధికారులు తమ కింది స్థాయి సిబ్బంది చేపట్టే కార్యక్రమాలను సమీక్షించాలని, ఎప్పిడికి వెళ్ళినపుడు అక్కడే ఆ గ్రామ పంచాయతీకి సంబంధించిన అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల విషయాలను సమీక్షించి సరి చేసుకోవాలన్నారు. జిల్లాలో పరిస్థి తులను బట్టి ఏ ప్రాంతాల్లో ఏ మందులు ఎక్కువ అవసరమో అందుకు అనుగుణంగా మందుల నిల్వలు వుంచుకునే విధంగా ఏజెన్సీలు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఆసుపత్రుల్లో పరికరాల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఆసుపత్రు ల నుండి బయో మెడికల్ వేస్ట్‌ను పక్కాగా సేకరించి డిస్‌పోజ్ చేయాలన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ 450 మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, 540 ఎఎన్ఎంలు, 1,526 ఆశా వర్కర్లు వుండగా కంటి పరీక్షల నిర్వహ ణలలో భాగంగా జిల్లాలో 76,629 మంది విద్యార్థులకు స్క్రీనింగ్ నిర్వహి ంచి 3,500 మంది విద్యార్థులకు కంటి సమస్యలు గుర్తించి కళ్ళజోడు పంపిణీ చేయడం జరిగిందని కమీషనర్‌కు వివరించారు. అలాగే జిల్లాలో దోమల కట్టడికి పక్కాగా చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం చేపడుతున్నా మన్నారు.

ఈ సమీక్షా సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి, డిసిహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతి, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్టీఆర్ వైద్యసేవ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిడాక్టర్ హనుమంతరావు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్‌తో కలిసి వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి

## భూసేకరణ సంబంధించిన పనులను పూర్తి చేయాలి : కలెక్టర్



కోట, జనవరి 24 ప్రభాతవార్త : నాయుడుపేట, తూర్పు కనుమూరు 6 లైన్ జాతీయ రహదారుల నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేయాలి అని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. శుక్ర వారం స్తానిక కోట మండలం నందు క్యాంప్ కార్యాలయంలో నాయుడుపేట-తూర్పు కనుపూరు 6లైన్ జాతీయ రహదారుల నిర్మాణం, గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే, ఫోర్ట్ కనెక్టీవీటి ప్రాజెక్ట్స్ పై గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, నెల్లూరు నేషనల్ హైవే పి డి చౌదరి, నేషనల్ హైవే, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులతో కలిసి జిల్లా కలెక్టరేట్ సమీక్ష సమావేశం నిర్వహించారు కలెక్టర్ మాట్లాడుతూ నాయుడుపేట, తూర్పు కనుమూరు 6 లైన్ జాతీయ రహదారుల నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేయాలి అని అన్నారు. నాయుడుపేట తూర్పు కనుపూరు 6 లైన్ జాతీయ రహదారుల నిర్మాణం, గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే, ఫోర్ట్ కనెక్టీవీటి ప్రాజెక్ట్స్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. రహదారుల నిర్మాణానికి సంబంధించి అవసరమైన భూసేకరణకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని తెలిపారు. పనులుపూర్తి కావడానికి ఇరిగేషన్, రివెన్యు, పోలీస్‌శాఖ అధికారులు సహకరించాలని అన్నారు. సైట్ ఇంజనీర్ వేణుగోపాల్, కోట, చిల్లకూరు, ఓజీలి, నాయుడుపేట జె.జె.రావు, శ్రీనివాసులు, పద్మావతి, రాజేంద్ర, ఇరిగేషన్ శ్రీనివాసరావు, సి.ఐ.పవన్ పాల్గొన్నారు.

# మార్పుదిశగా పనితీరు సాగిస్తా!

**-పోలీసుశాఖ ప్రతిష్ట పెంపొందేలా బాధ్యత -విజువల్‌పోలీసింగ్‌తో ప్రజలకు మరింత భద్రత -నూతన ఎస్పీ హర్షవర్ధనరాజు**



తిరుపతికార్పొరేషన్, జనవరి 24ప్రభాతవార్త: పోలీసులంటే ఎలా ఉండాలో....ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగడం, విధులను సక్రమంగా నిర్వర్తించే విధంగా పనితీరులో మార్పుతీసుకువస్తానని తిరుపతి జిల్లా నూతన ఎస్పీ వి.హర్షవర్ధనరాజు ఉద్ఘాటించారు. తాను ఏదీ ముందుగా చెప్పనని, ఏమి చేయాలనే దానిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఆ మార్పులు చేసి చూపిస్తానన్నారు. మనం చేస్తున్న విధులను సక్రమంగా చేసే విధంగా ప్రతి సిబ్బంది బాధ్యతతో పనిచేయాలన్నారు. ప్రజలకు మెరుగైనసేవలందించాలని, అప్పుడే మార్పు అనేది ప్రజలు నిర్ణయిస్తారని కొత్త ఎస్పీ కొత్తభాష్యం చెప్పారు. ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని, శాంతిభద్రతల పరిరక్షణ, గంజాయి, మత్తుపదార్థాలు విక్రయాలు, అక్రమ రవాణా అరికట్టడం, ఓపన్ బూసింగ్, విజువల్ పోలీసింగ్ అధిక ప్రాముఖ్యతని స్తానన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలన్నారు. రానున్న ముందు ముందు రోజుల్లో పోలీసు సిబ్బంది విధులు క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా నిర్వహించాలని నిర్దేశం చేశారు. తిరుపతి జిల్లాకు మళ్ళీ ఎస్పీగా రావడం ఈ అవకాశం కలగడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. శక్తివంచనలేకుండా పనిచేసే విధంగా నిబద్ధతతో చూస్తానన్నారు. తిరుపతి ఆధ్యాత్మిక ప్రాంతం కావడంతో ఇక్కడ ప్రజల సహకారం ముఖ్యమన్నారు. తిరుపతి ఎస్పీగా రెండవసారి శుక్రవారం సాయంత్రం ఆయన పోలీసు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు పోలీసుల నుండి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం తిరుపతి జిల్లా పోలీసు అధికారులతో పనితీరుపై, నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల అరికట్టడంపై గట్టిగా ఆదేశాలిచ్చారు. ఈ సమావేశంలో అదనపుఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి. నాగభూషణం, డిఎస్పీలు జె.వెంకటనారాయణ, ప్రసాద్, రామకృష్ణమాచారి, శ్యామ్‌సుందర్, ఎస్‌బి సిఐలు శ్రీనివాసులు, విక్రమ్ జిల్లాలోని సిఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు. నూతన ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపారు.

# ఫిబ్రవరి 4న మరింత అప్రమత్తత అవసరం

**-రథసప్తమిన భక్తులకు సకల సౌకర్యాలు -మాఢవీధుల్లో ప్రవేశనిష్క్రమణ సాఫీగా సాగాలి -ఏర్పాట్లపర్యవేక్షణలో అధికారులు**



తిరుమల.జనవరి 24ప్రభాతవార్తప్రతినిధి: ఏడాదిలో తొమ్మిదిరోజులు బ్రహ్మోత్సవాలు జరగడం ఒక ఎత్తయితే ఒకేరోజు ఏడువాహనాలు ఊరేగడం మరో ప్రత్యేకత కావున, ఫిబ్రవరి 4వతేదీ రథసప్తమిన అందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని టిటిడి ఈఓ జె.శ్యామలరావు అధికారులకు ఆదేశాలిచ్చారు. రథసప్తమి వేడుకలకు అశేషసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశంఉందని, మాఢవీధుల్లోని గ్యాలరీల్లో లక్షమంది వరకు భక్తులు వేచిఉంటారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని భద్రత పరంగా ఏర్పాట్లు మరింత కట్టుదిట్టంగా చేయాలన్నారు.ఫిబ్రవరి 4వతేదీ మంగళవారం రథసప్తమివేడుకల ఏర్పాట్లు, మాఢవీధుల్లో గ్యాలరీలు, భక్తులను అనుమతించడం, నిష్క్రమణ ద్వారాలు అంశాలపై శుక్రవారం మధ్యాహ్నం టిటిడి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు, జిల్లా సంయుక్తకలెక్టర్ శుభంబన్సల్, తిరుమల అదనపు ఎస్పీ ఐ.రామకృష్ణ, అదనపు ఎస్పీ వెంకట్రావు, తిరుమల డిఎస్పీ విజయశేఖర్, విఎస్ఓలు ఎస్టీవిరామ్ కుమార్, అల్లంసురేంద్ర, సిఇ సత్య నారాయణ, ఆలయ డిప్యూటీ ఇఓ లోకనాథంతో కలసి తనిఖీలు చేశారు. పరిశీలించిన విషయాలపై అన్నమయ్య భవనంలో సమీక్షించారు. భక్తులకు వసతి, పార్కింగ్ చక్కగా ఉండాలన్నారు. ఆ రోజు అన్ని ప్రత్యేక దర్శనాలు, ఆర్జితసేవలు రద్దుచేయడం జరిగిందన్నారు. 4న ఉదయం 5.30గంటలకు తొలివాహనంగా సూర్యప్రభవాహనం మొదలై ఉదయం 8గంటల వరకు మాఢవీధుల్లో ఊరేగనుంది. గంటకో వాహనం వరుసగా తొమ్మిదివాహనాలపై మలయప్ప స్వామి భక్తులను కటాక్షిస్తారన్నారు.

## అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయండి : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, జనవరి 24 ప్రభాతవార్త : ప్రజలకు ఉపయోగకరమైన అభివృద్ధి పనులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం నగరపాలక సంస్థ పరిధిలోని ఆటోనగర్, కృష్ణారెడ్డి కాలని, అంబేద్కర్ కాలని తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ ఉమా అజయ్, ఆరోగ్యశాఖ, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక శాఖ అధికారులతో కలసి పరిశీలించి ప్రజల సమస్యలను తెలుసు కున్నారు. పారిశుద్ధం మెరుగ్గా చేపట్టాలని, మురుగునీటి కాలువలు మరమ్మత్తులకు గురై నీరు రోడ్లపైకి వస్తున్నాయని, త్రాగునీరు ఒకే సమయంలో సరఫరా చేయాలని కోరారు. అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు జరుగుతుంటే ఆపాలని, నిర్మాణాలకు ఉపయోగించే గుళ్ళ, ఇసుక తదితరాల రోడ్లపై వేయకుండా చూడాలని అన్నారు. ఆరోగ్య కేంద్రం చుట్టూ శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, డి.ఈ రమణ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసిపి బాలాజి, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ సుమతి, ఇంజినీరింగ్, ఆరోగ్యశాఖ, ప్లానింగ్ సిబ్బంది అన్నారు.

**గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్**

తిరుపతిలోని పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 26న నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను నగరపాలక సంస్థ కమిషనర్, తుడ ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య శుక్రవారం ఉదయం పరిశీలించారు. నగరపాలక సంస్థ, తుడ సంయుక్తంగా పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఏర్పాట్లు అన్ని పక్కగా చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట తుడ, నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్లు కృష్ణారెడ్డి, శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, తుడ ఈ.ఈ. రవీంద్ర, డి.ఈ. మహేష్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.

# 26న విజయవాడలో కులగణన, రిజర్వేషన్లపై చర్చ

పుంగనూరు, జనవరి 24 ప్రభాతవార్త:ఈనెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో బిసి రిజర్వేషన్లు, కాపులకు ప్రత్యేక రిజర్వేషన్ ఏర్పాటు, కులగణన అంశాలపై విజయవాడలో రాష్ట్ర వ్యాప్త చర్చా వేదిక నిర్వహిస్తున్నట్లు బీసీవైపార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారతీయ చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా అన్ని బీసీ సంఘాల ప్రతినిధులతో బీసీ రిజర్వేషన్ పెంపు, కాపు ప్రత్యేక రిజర్వేషన్, కేంద్ర ప్రభుత్వ నిజాళీ విధి విధానాల సమీక్ష తోపాటు విస్తృత చర్చ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థలు, విద్యా, ఉద్యోగాలలో బీసీలకు 39 శాతం వరకు రిజర్వేషన్లు పెంచాలని ప్రధాన చర్చ మొదలవుతుందన్నారు. మహారాష్ట్రలో మరాఠీలకు అక్కడి ప్రభుత్వం ఐదు శాతం ప్రత్యేక రిజర్వేషన్ ఇచ్చిన తరహాలో ఆంధ్రప్రదేశ్ లో కూడా కాపు కులస్తులకు ఐదు శాతం ప్రత్యేక రిజర్వేషన్ కేటాయించాలని ఈ వేదిక చర్చిస్తుందన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌పై కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విధి విధానాలను కూడా ఈ వేదిక పైన పూర్తిస్థాయిలో చర్చించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీనాయకులు, కార్యకర్తలు, అభిమా నులు తప్పనిసరిగా రావాలని సూచించారు. ఈ వేదికలో చర్చించిన అంశాలను, ప్రతిపాదించబడిన కీలక విషయాలను అమలులోకి తీసుకువచ్చేలా చేసేందుకు బీసీవై సారథ్యంలో జరగబోయే కార్యాచరణకు ఈ వేదిక తొలి అడుగు కాబోతోందని వివరించారు.



# ఉద్యోగాలు భర్తీచేయండి...లేకుంటే గద్దె దిగండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎఐవైఎఫ్ నాయకులు

తొట్టంబేడు, జనవరి 24 ప్రభాతవార్త : శ్రీసిటీలో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని ఏఐవైఎఫ్ మహాసభలో వక్తల డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీచేసి యువతకు ఉపాధి కల్పించాలని, ఉద్యోగం ఉపాధి లేక దేశంలో నిరుద్యోగ సమస్య రికార్డు స్థాయిలో పెరుగుతుందని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు తీవ్రస్థాయిలోవిమర్శించారు. అఖిలభారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ తిరుపతి జిల్లా రెండో మహాసభ పట్టణంలోని గాంధీవీధి నుంచి అంబేద్కర్ భవన్‌కు వందలాది మంది యువజన కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. జిల్లా మహాసభ సందర్భంగా ఏఐవైఎఫ్ అరుణ పతాకాన్ని మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.రామానాయుడు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రతినిధులకు ఏ.రామానాయుడు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సభకు జిల్లా అధ్యక్షులు రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా లెనిన్‌బాబు మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీకాకపోవడంతో నిరుద్యోగం రికార్డు స్థాయిలో పెరుగుతుందని దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేయడం నిర్ణయాన్ని విరమించుకుని యువతకు ఉపాధి ఉద్యోగాలు కల్పించి దేశాన్ని అభివృద్ధి బాటలో యువతను భాగస్వామ్యం చేయాలని కోరారు. అనేకసార్లు మంత్రివర్గ సమావేశాదలు జరిగిన వాటిపై ఎందుకు చర్చించడం లేదన్నారు. రాజధాని అమరావతిని ఫ్రీ జోన్ చేయాలని అక్కడ భర్తీ చేసే ప్రభుత్వ ఉద్యోగాలలో 26 జిల్లాల నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అమరావతి రాజధాని ఫ్రీజోన్ చేయడం ద్వారానే అందరికీ లబ్ధి చేకూర్చుతుందని లేకపోతే వెనుబడిన ఉత్తరాంధ్ర రాయలసీమ జిల్లాల నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఏఐవైఎఫ్ నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షులుగా జయకృష్ణ(వెంకటగిరి), ఉపాధ్యక్షులుగా నాగరాజు(తిరుపతి), భానుచంద్ర(రేణిగుంట), నాగార్జున(సత్యవేడు), జిల్లా కార్యదర్శిగా ఎం.రామకృష్ణ(తిరుపతి), జిల్లా సహాయ కార్యదర్శిగా మల్లికార్జుని (శ్రీకాళహస్తి), పూర్ణచంద్ర(తిరుపతి) ప్రవీణ్‌కుమార్(తిరుపతి) కోశాధికారి సునీల్ వీరితో పాటు 27మందిని కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర నాయకులు కత్తిరవి తెలిపారు.

## నీటిలోనే...
# కడసారి కష్టాలు

**శ్మశానం చేరాలంటే వంక దాటాల్సిందే స్వర్ణముఖిలో నీరు-మృతి చెందితే కన్నీరు**



నీటిలో శవాన్ని మోస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తిరూరల్, జనవరి 24 : శ్రీకాళహస్తి నియోజకర్గంలో పలు గ్రామాలకు శ్మశానాలు లేదు. శ్మశానం చేరాలంటే కడసారి కష్టాలు తప్పటం లేదు. ఏర్పేడు మండలంలోని ఎండిపుత్తూరు గ్రామ ప్రజల కష్టాలు మరీ దారుణంగా మారింది. కొన్ని గ్రామాల్లో పంట పొలాల్లో గెనాల మీద నుంచి వెళ్ళాల్సి ఉంది. అయితే ఎండిపుత్తూరు గ్రామానికి చెందిన వారు మెడలోతు నీటిలో కడసారి కష్టాలు అన్నట్లు శుక్రవారం మారింది. ఈ గ్రామ శ్మశానం చేరాలంటే వంక దాటాల్సిందే. గత ఒరెండు నెలలుగా ఎడతెరపిలేని వర్షాలతో స్వర్ణముఖి నదిలో నీరు తగ్గలేదు. ఇసుకాసురుల పుణ్యమా అని ఎక్కడ గుంత ఉందో ఏమో తెలియదు. అయితే ఎండిపుత్తూరులో గురువారం చింతా పుట్టాలమ్మ(98) మృతి చెందింది. అయితే ఆమె మృతదేహాన్ని మోయటానికి స్వర్ణముఖి నదిలో మెడలోతు నీటిలో దాటాల్సి వచ్చింది. ఈ గ్రామానికి ప్రత్యేకంగా శ్మశానం లేదు. శతాబ్దాలుగా స్వర్ణముఖి నదిలో దహనం, ఖననం చేస్తుంటారు. శుక్రవారం పుట్టాలమ్మ శవాన్ని శ్మశానానికి చేర్చుటకు బంధువులు, గ్రామస్తులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడారు. ఎట్టకేలకు కొందరు శవాన్ని మోసుకుంటూ దిగారు. అడుగు ముందుకేసిన కొద్దీ మెడలోతు నీళ్ళలోకి వెళ్ళారు. గట్టున ఉన్న వారు కేకలు, మోసిన నలుగురు తప్ప ఎవ్వరూ అవతలి గట్టుకు చేరుకోలేక పోయారు. చివరకు దాయాదులు కూడా వంక దాటలేని దుస్థితి చోటు చేసుకుంది. వర్షాకాలం వస్తే ఎండిపుత్తూరు గ్రామస్థుల అవస్థలు వర్ణనాతీతంగా మారిందన్నారు. ఊరు ద్వీపంగా మారుతుంది. వర్షాకాలం ఎవరైన చనిపోతే తమ పాట్లు చెప్పనలవి కాదని వాపోతున్నారు. శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి స్పందించి ఎండిపుత్తూరు ప్రజలకు శ్మశానానికి స్థలం కేటాయించటానికి రెవెన్యూ అధికారుల ద్వారా చొరవ చూపాలని కోరుతున్నారు.

## మద్యం షాపుల కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా పూర్తి

తిరుపతి కలెక్టరేట్, జనవరి 24 ప్రభాతవార్త : తిరుపతి జిల్లాలోని కల్లు గీత కార్మికులకు ఉప కులాల ప్రాతిపాదికన రిజర్వు చేయబడిన మద్యం షాపుల కేటాయింపును ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో గీత, ఉప కులాల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా పూర్తి చేయడం జరిగిందని జిల్లా సంయుక్త కలెక్టర్ శుభం బన్సల్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరం నందు ప్రభుత్వం వారు ఎక్సైజ్ శాఖ ద్వారా కల్లు గీత కార్మికులకు ఉప కులాల (గౌడ, గౌడు, ఈడిగ, గౌండ్ల) ప్రాతిపాదికన రిజర్వు చేయబడిన మద్యం షాపుల కేటాయింపు లాటరీ ప్రక్రియను గీత, ఉప కులాల ప్రతినిధుల సమక్షంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నిర్వహించడం జరిగింది. ఇందులో గౌడ్ కులానికి 3, ఈడిగ కులానికి 15, గౌడకులానికి 2, గౌండ్ల కులానికి 3 మద్యం షాపులను లాటరీ పద్ధతిలో కేటాయించడం జరిగింది.

## ప్రభుత్వ విప్‌చే కుంభాభిషేక పోస్టర్ల ఆవిష్కరణ



**కుప్పం, జనవరి 24 ప్రభాతవార్త :** కుప్పం పాతపేట మునసా ్వమిపురంలో నూతనంగా నిర్మించిన శ్రీ నల్ల గంగమాంబ అమ్మవారి ఆలయ మహాకుంబా భిషేకం పోస్టర్లను శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆవిష్కరించారు. ఈనెల 27వతేది నూతన దేవతామూర్తుల గ్రామోత్సవం, మహాగణపతి పూజతో కుంబాభిషేక ఉత్సవాలు మొదలవుతాయన్నారు. ఈనెల 29వతేది మహాప్రాణ ప్రతిష్ట, మహాకుంబాభిషేకం, అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ ఎంపిపి వెంకటేష్, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి శివతేవర్ తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కోర్సులతో ఉపాధి అవకాశాలు



**కుప్పం, జనవరి 24 ప్రభాతవార్త :** పాలిటెక్నిక్ కోర్సులతో విద్యార్థులు ఉపాధి అవకాశాలు మెరుగు పరచుకోవచ్చని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ ప్రిన్సిపాల్ జగన్నాధరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పిఎంశ్రీ బాలికల హైస్కూల్‌లో పాలిటెక్నిక్ కోర్సులు, పాలిసెట్-2025పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పాలిటెక్నిక్ డిప్లమో కోర్సులు పదవ తరగతి పూర్తయ్యాక చదవచ్చని ఈ కోర్సులతో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సయ్యద్ హుసేన్, రమేష్, హెచ్‌ఎం వెంకటేశ్వరబాబు, ఈశ్వరాచారి, ప్రతిభ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ద్రవిడ వర్సిటీలో మూడో రోజు నాక్ బృందం పరిశీలనలు

– పర్యటన విజయవంతం.. త్వరలోనే వర్సిటీకి గ్రేడింగ్ కేటాయింపు !!



**కుప్పం, జనవరి 24 ప్రభాతవార్త :** ద్రవిడ వర్సిటీలో నేషనల్ అక్రిడిటేషన్ కమిటీ (నాక్) బృందం మూడో రోజు శుక్రవారం సైతం పరిశీలనలు జరిపింది. రెండు రోజులుగా వర్సిటీలోని అన్ని విభాగాల అధికారులు, అన్ని శాఖల పనితీరును పరిశీలించారు. వర్సిటీ దత్తత తీసుకున్న గ్రామాల్లో సైతం పర్యటించి అక ్కడ వర్సిటీ చేపట్టిన అభివృద్ధి పనులను గ్రామస్తులతో అడిగి తెలుసు కున్నారు. వర్సిటీలోని హాస్టళ్ళు, మైదానాలు, ఆడిటోరియం, మూలికావనం, జానపద మ్యూజియం, సెంట్రల్ లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, అకడమిక్ సెక్షన్ వంటి వాటిని పరిశీలించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. శుక్రవారం చివరి రోజు వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులతో జరిగిన పర్యటన ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. తమ పర్యటనకు సంబంధించిన అభిప్రాయాలను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దొరస్వామికి అందజేశారు. కాగా త్వరలోనే నాక్ బృందం వర్సిటీకి గ్రేడింగ్‌ను అధికారికంగా కేటాయించనుంది.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలి

– ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్



**శాంతిపురం, జనవరి 24 ప్రభాతవార్త :** విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక శ్రీ పరమహంస యోగానంద విద్యాలయ 24వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటిబాలలే రేపటి పౌరులని దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో స్కూల్, కాలేజ్ దశలు ఎంతో కీలకమన్నారు. కుప్పాన్ని విద్యాహబ్‌గా మలచే ందుకు సిఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మంచిపేరు తేవాలని, బాగా చదువుకోవాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో రాష్ట్ర నేత బిఆర్ సురేష్‌బాబు, విద్యాలయ ఛైర్మన్ గోపాల్ జీ అగర్వాల్, జిసి మెంబర్ మాజీ రెస్కో ఛైర్మన్ చక్రపాణిరెడ్డి, ప్రిన్సిపాల్ ఆజాద్ హుసేన్, నేతలు విశ్వనాథనాయుడు, జనార్థనరెడ్డి, ఉదయ్‌కుమార్, జయరాంరెడ్డి, చలపతి, అనసూయ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## నేటి బాలికలే రేపటి సమాజానికి మార్గదర్శకులు



**కల్లూరు, జనవరి 24 ప్రభాతవార్త:** నేటి బాలికలే రేపటి సమాజానికి మార్గదర్శకులు కావాలని ఐసిడిఎస్ సూపర్వైజర్లు విజయలక్ష్మి రమాదేవి అన్నారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సూపర్వైజర్లు విజయలక్ష్మి రమాదేవి ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. జి.ఎం.ఎస్.కేలు నీలిమ సారికలు బాలికల హక్కులు పోక్సో చట్టం గురించి సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, సయ్యద్ వలి, నానిక నాయక్ అంగనవాడి కార్యకర్తలు సుజాత, ప్రేమలత, కళావతి, సరళ, శోభ, గీత, ఎర్రమ్మ ఆశా కార్యకర్తలు శివరాణి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

## బాలికలు ఆరోగ్యవంతంగా ఎదగాలి



**పుంగనూరు రూరల్, జనవరి 24 ప్రభాతవార్త :** బాలికల ఆరోగ్యవంతంగా ఎదిగినప్పుడే సమాజానికి శ్రేయస్కరం అని ఐసీడీఎస్ సూపర్వైజర్ అయిషా నజ్రీన్ తాజ్ అన్నారు. శుక్రవారం జాతీయ బాలికాదినోత్సవాన్ని స్థానిక లియనార్డ్ గర్ల్స్ స్కూల్లో పిల్లలకు బాలికలలో మానసిక సామర్థ్యాన్ని పెంపొం దించుకోవడానికి అవసరమైన అయిన విషయాలను తెలియ చేసారు. అలాగే సాంఘీకం గా ఆడవారు ఎదుర్కొనే రకరకాలైన సమస్యల గురించి వాటిని వాటిని ఎదుర్కోవడానికి కావాల్సిన మనోధైర్యం గురించి తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఫామిద బేగం, షాగుఫ్త, శిరిన్, వైష్ణవి లియోనార్డ్ స్కూల్ హెచ్‌ఎం ఉషా, అంగన్వాడీ కార్యకర్త ప్రేమ, ఆశావర్కర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

## ఘర్షణలో గాయపడిన జనసేన కార్యకర్త

**సోమల, జనవరి 24 ప్రభాతవార్త :** సోమల మండలం కందూరులో జనసేన తెలుగుదేశం పార్టీల మధ్య వివాదం చెలరేగింది. మునీర్‌తో పాటు అతని తల్లి కూడా గాయాలపాలైంది. దీంతో ఆగ్రహించిన జన సైనికులు మునీర్‌కు కందూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స నిర్వహించి 108లో పీలేరు తరలించారు. మునీర్ తండ్రి ఖలీల్ బుధవారం రాత్రి తన కుమారునిపై దాడికి దిగిన తెలుగుదేశం నాయకులుపై చర్యలు తీసుకోవాలంటే సోమల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ చిన్న రాయల్, మండల పార్టీ అధ్యక్షుడు సూరిశెట్టి నాగభూషణం జనసేన నాయకులతో కలిసి పీలేరులో మునీర్‌ను పరామర్శించి బాధితులకి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం



**సదుం, జనవరి 24 ప్రభాతవార్త:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నతపాఠశాలల్లో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో బాలికల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాల్యవివాహాలు, ఫోక్సో చట్టం, ఉన్నత విద్య ఆవశ్యకతలను వివరించారు. ఎంఇఓ దామోధర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరీ, ప్రిన్సిపాల్ వెంకటనాథరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు జయకుమార్‌రెడ్డి, మహిళా పోలీసులు ఆసియా, సరస్వతి, రిహాన్, రాణి, భార్గవి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మౌళిక వసతుల కల్పనకు కృషి చేయాలి

**సదుం, జనవరి 24 ప్రభాతవార్త :**



స్థానిక జ్యోతిబాపులే గురుకుల పాఠశాలలో మౌళిక వసతుల కల్పనకు కృషి చేయాలని ఎస్ఎస్‌పి రాష్ట్ర విషయ పరిజ్ఞాని ఎం బుజ్జి, జిల్లాధికారి శంకర్‌లు తెలిపారు. శుక్రవారం ఆపాఠశాల ఆవరణంలో గ్రామసభ జరిగింది. ఈనెల 22నుంచి 24వరకు పాఠశాలలోని ప్రతి తరగతి గదిని సందర్శించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి సమగ్ర నివేదికను తయారు చేసారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులురెడ్డి, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛేర్మన్ ప్రభాకర్, ఉపాధ్యక్షులు రెడ్డెమ్మ, సభ్యులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## రహదారి భద్రత నియమాలతోనే సురక్షిత గమ్యం

**గుడిపాల, జనవరి 24 ప్రభాతవార్త:**





రహదారి భద్రతా నియమాలు పక్కాగా పాటించి సురక్షితంగా గమ్య స్థానం చేరుకుంటారని చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ మాంటి కార్లో లిమిటెడ్ హైవే ఫేజ్-3 ప్యాకేజీ-1 అసిస్టెంట్ మేనేజర్ ముఖేష్ కుమార్‌గుప్తా, సైట్ ఇన్‌ఛార్జీ బోలెందర్ సింగ్‌లు అన్నారు. గుడిపాలలోని సిఎన్ఆర్ కళాశాలలో శుక్రవారం 36వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ మాంటి కార్లో లిమిటెడ్ హైవే ఫేజ్-3 ప్యాకేజీ-1 సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన సంస్థ అసిస్టెంట్ మేనేజర్ ముఖేష్‌కుమార్ గుప్తా, సైట్ ఇన్‌ఛార్జీ బోలెందర్ సింగ్‌లు మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలను పూర్తి స్థాయిలో కట్టడి చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రామచంద్ర, ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అర్జున్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## డప్పు కళాకారుల వృత్తి నైపుణ్యం పరిశీలన



**పాలసముద్రం, జనవరి 24 ప్రభాతవార్త:** డప్పు కళాకారులు వృత్తి నైపుణ్యంను శుక్రవారం తహసిల్దారు అరుణకుమారి పరిశీలించారు. జిల్లా పౌరసంబంధాలశాఖ అధికారి మండల పరిధిలోని డప్పు కళాకారుల వివరాలను తెలియజేయాలని, అలాగే ప్రస్తుతం వీరు డప్పు కళాకారులుగా విధులు నిర్వహిస్తున్నారా! లేదా! అనే వివరాలను కోరారన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని డప్పు కళాకారులను శుక్రవారం ఆమె తహసిల్దారు కార్యాలయం వద్దకు పిలిపించి వారి డప్పు వృత్తిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ నరసింహులు, సర్వేయర్ గణేష్, విఆర్ఓ తంగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మరో 10 మద్యం షాపులు

– కల్లుగీత కార్మికులకు లాటరీ ద్వారా మద్యం షాపులు కేటాయించిన కలెక్టర్

**చిత్తూరు, జనవరి 24 ప్రభాతవార్త:** జిల్లాలో మరో 10 కొత్త మద్యం షాపులు అందుబాటులోకి వచ్చాయి. ఈ మేరకు కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం కలెక్టరేట్‌లో కల్లు గీత కార్మికుల కోసం కేటాయించిన పది మద్యం షాపులను ఖరారు చేశారు. కల్లు గీత కార్మికుల్లో ఉప కులాలకు సంబంధించి జిల్లాకు 10 మద్యం షాపులను ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు షాపులను కైవసం చేసుకోవడానికి అదే వర్గానికి చెందిన పలువురు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ మేరకు కలెక్టర్ సుమిత్‌కుమార్ లాటరీ పద్ధతిలో డిప్ తీసి కల్లు గీత కార్మికులకు చెందిన మద్యం షాపులను కేటాయించారు.

## బాలికా విద్యతోనే దేశాభివృద్ధి

**పాలసముద్రం, జనవరి 24 ప్రభాతవార్త:**



బాలికా విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని గంగాధరనెల్లూరు సిడిపిఓ జి.వినీత అన్నారు. పాలసముద్రం జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలికా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సిడిపిఓ వినీత మాట్లాడుతూ బాలికలు చదువులు, క్రీడలతో పాటు అన్ని రంగాల్లో అగ్రగామిగా వుండాలని, మహిళలు మరో ఝాన్సీరాణిగా తయారు అవ్వాలని, ఆడపిల్లలను వారి తల్లిదండ్రులు అదృష్ట సిరులుగా భావించి చదివించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ-2 గిరిజ, హెడ్మాస్టర్ మీనాక్షి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అనురాధ, సంగీత, హెల్త్ సూపర్‌వైజర్ సుశీలమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## హలో ఛలో బిసీ ఢిల్లీకి ఎక్సైజ్ మంత్రి మద్దతు



**చిత్తూరు, జనవరి 24 ప్రభాతవార్త:** బిసీల సమస్యల శాశ్వత పరిష్కారం కోసం దేశ రాజధాని న్యూఢిల్లీలో ఫిబ్రవరి 6వ తేదీ నిర్వహించనున్న హలో ఛలో బిసీ ఢిల్లీ కార్యక్రమంకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కొల్లు రవీంద్ర మద్దతు పలికారు. చిత్తూరు మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్, దక్షిణాది రాష్ట్రాల జాతీయ బిసీ సంక్షేమ సంఘం ఇన్‌ఛార్జీ షణ్ముగం శుక్రవారం విజయవాడలో ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను కలిసి సన్మానించి ఢిల్లీ బిసీ సభకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా బిసీ నాయకులు షణ్ముగం మంత్రి కొల్లు రవీంద్రకు బిసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## బాలికల అక్షరాశ్యతతోనే కుటుంబాభివృద్ధి

**పుదిపట్ల(చౌడేపల్లి), జనవరి 24 ప్రభాతవార్త :**





బాలికల అక్షరాశ్యతతోనే కుటుంబం అభివృద్ధి చెందుతుందని ప్రధానోపాధాయురాలు పద్మజ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సులోచనాలన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండలంలోని పంచాయతీ కేంద్రం పుదిపట్ల ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాలికా విద్య సమాజంలో తన స్థిరత్వాన్ని ఏర్పాటు చేసుకొంటుందన్నారు. అనంతరం విద్య, వైద్యం, తనను తాను కాపాడుకొనే తీరును వివరించారు. మహిళా పోలీసు పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్త చంద్రావతి, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

## పెద్దకొండామర్రిలో ఉచిత పశువైద్య శిబిరం

**పెద్దకొండామర్రి(చౌడేపల్లి), జనవరి 24 ప్రభాతవార్త :**



మండలంలోని పంచాయతీ కేంద్రం పెద్దకొండా మర్రిలో శుక్రవారం ఉచిత పశువైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసారు. మేకలు, గొర్రెలకు 2వ విడత నట్టల నివారణ మందులు పంపిణీ చేసారు. పశువుల్లో సోకే పలు వ్యాధులపట్ల రైతులకు అవగాహన కల్పించారు. పశువైద్యాధికారి పవన్‌కుమార్, సిబ్బంది రెడ్డిప్రసాద్, హరీష్, జానకిరామ్, హరిత, పాడి రైతులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులు సమాజ హితులు...క్లబ్‌చే సేవలు

**చౌడేపల్లి, జనవరి 24 ప్రభాతవార్త :**



ఆర్యవైశ్యులు సమాజ హితులని వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఇస్నా నాగలక్ష్మి, 211ఎ జిల్లా గవర్నర్ రవితేజశ్విలన్నారు. స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వాసవీ-వనితాక్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. వాసవీ-వనితా క్లబ్ అధ్యక్షులుగా అమరావతి శ్రీనాథ్, అన్నం రంగవల్లి, కార్యదర్శులుగా బైసాని లోకేష్, నాగలక్ష్మి, కోశాధి కారులుగా అమరావతి అమరనాథ్, కలపాటి వాణిలను ఏకగ్రీవంగా ఎన్ను కొన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవలకు నాంది పలుకుతున్నట్లు వివరించారు. జిల్లా కార్యదర్శి కోమలాదేవి, వినయ్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాలు ఢీ : ఒకరికి గాయాలు

**చౌడేపల్లి, జనవరి 24 ప్రభాతవార్త :** రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరికి గాయాలైన సంఘటన శుక్రవారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. స్థానిక బస్టాండులో ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ బండమీదపల్లికి చెందిన పరమేశ్వర(26)కు గాయాలయ్యాయి. గాయపడ్డ అతన్ని చుట్టుపక్కల వారు స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇక్కడ పరమేశ్వర ఆరోగ్య పరిస్థితి విషయమించడంతో పుంగనూరుకు సిఫారస్సు చేసారు.

## సంపద సృష్టించే షేడ్లను వాడుకలోకి తీసుకురాలి

**వెదురుకుప్పం, జనవరి 24 ప్రభాతవార్త :**



ఘన, వ్యర్థాల నుండి సంపద సృష్టించే లక్ష్యంతో నిర్మించిన షేడ్లను ఉపయోగంలోకి తీసుకురావలని జిల్లా పంచాయితీ అధికారి సుధాకర్‌రావు అధికారులను ఆదేశించారు. మండలంలోని పచ్చికాపల్లం, కొమరగుంట పంచాయితీ పరిధిలో నిర్మించిన ఎస్‌డబ్ల్యూపీసీ షేడ్లను శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఎంపిడివో కార్యాలయం సమావేశ భవనంలో అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్యం అనేది ఘన, వ్యర్థాలను సమర్ధవంతంగా నిర్వహించడం ద్వారా సాధ్యమవుతుందన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు అనారోగ్య, ఆర్థిక సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. షేడ్లు వాడుకలోకి తీసుకురావడంతో పాటు వర్మీకంఫోస్టు ఎరువు తయారు చేసి రైతులకు అమ్మకాలు చేపట్టాలని చూచించారు. మార్చి 31లోపు ప్రక్రియ పూర్తి చేసి వంద శాతం వాడుకలోకి తీసుకురావలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో అమర్నాధ్, ఇవోపిఆర్‌డి పురుషోత్తం, ఏవో నాగరాణి, పంచాయితీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ విద్యావరసిద్ధి వినాయకస్వామి ఆలయకుంభాభిషేకం.

-హాజరైన ఎమ్మెల్యే అమర్, మాజీ ఎమ్మెల్సీ రెడ్డెప్పరెడ్డి..

**పెద్దపంజాణి, జనవరి24 ప్రభాతవార్త:**



మండలంలోని గోనుమాకుల పల్లిలో దాత నాగభూషణంరెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీవిద్యావరసిద్ధి వినాయకస్వామి ఆలయ కుంభాభిషేక కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు స్వామివారి విగ్రాహాన్ని ప్రతిష్ఠించి, వేదపారాయణం గణపతిపూజ కలశారాధన కార్యక్రమాలను జరిపారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రెడ్డెప్పరెడ్డి హాజరయ్యారు. కాగా స్వామివారి లడ్డూప్రసాదాన్ని వేలం నిర్వహించగా సుబ్రమణ్యంరెడ్డి లక్ష రూపాయలకు లడ్డూను దక్కించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రెడ్డివారి విజయ్‌భాస్కర్ రెడ్డి, ఎంపీపీ రెడ్డెప్ప, రెడ్డిసంఘం నాయకులు అమర్నాథ్‌రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి తెలుగుదేశం నాయకులు ఆనంద్, చలపతి, సుధాకర్ రెడ్డి, నాగరాజురెడ్డి, రోజారెడ్డి, భానుప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు జాతీయ ఓటరు దినోత్సవం

**కుప్పంరూరల్, జనవరి 24 ప్రభాతవార్త :** 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని శనివారం కుప్పం బాలుర హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ చిట్టిబాబు తెలిపారు. ఈసందర్భంగా ఓటరు దినోత్సవ ప్రాధాన్యత ప్రజలకు తెలిసేలా పట్టణంలో ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

# తిరుపతి డివిజన్

## నేడు ప్రకృతి వ్యవసాయం పై విద్యార్థులతో సదస్సు

**తిరుపతి, విద్య జనవరి 24 ప్రభాతవార్త:** శ్రీ వేంకటేశ్వర వర్సిటీ సరదు వ్యవసాయంపై యువతలో సానుకూల దృక్పథం ఏర్పరిచేందుకు, అదేవిధంగా ప్రకృతి వ్యవసాయంపై ఉపయోగాలు, అవగాహన, చేసే విధానాలుపై శనివారం వెయ్యి మంది విద్యార్థులకు పద్మశ్రీ సుభాష్ పాలేకర్ చేత సుభాష్ పాలేకర్స్ క్రిషి (ప్రకృతి వ్యవసాయం)పై నిర్వహించే కార్యశాల నిర్వహించబడుతుంది. దీనికి ముఖ్య అతిథిగా శ్రీ కాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, వర్సిటీ ఉపకులపతి ఆచార్య అప్పారావు, డిస్టిక్ ఫారెస్ట్ ఆఫీసర్ వివేక్ ఐఎఫ్ఎస్, రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు, ఆచార్య సీఎస్ రాయుడు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కేటీ రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారని తెలిపారు.

## పేదలకు అల్పాహారం వితరణ





**తిరుపతి, విద్య 24 జనవరి ప్రభాతవార్త:** తిరుపతి లో పలు చోట్ల ఉచితంగా అల్పాహారాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సినీ ప్రొడ్యూ సర్ అండ్ బాలాజి నర్సింగ్ కాలేజీ ఛైర్మన్ ప్రవీణ్ విచ్చేశారు. జేఏసీ తిరుపతి వారు ఎంతో ఉపయోగపడే కార్యక్రమాలు చేయడం ఆనందదాయకమని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి పార్థసారథి రెడ్డి, ఆర్ఆర్ రెడ్డి, జేఏసీ సభ్యులు జీవన్ వైస్ ఛైర్మన్ జి శంకర్, జోన్ ఆఫీసర్స్ సోమయ్య, రమణ, గుణ, రాజేష్, భాస్కర్, వినయ్, పద్మన్నాభ, దిలీప్ కుమార్ రెడ్డి, దిలీప్ కుమార్ తదిరులు పాల్గొన్నారు.

## గ్రామ రెవెన్యూ సహాయకులకు పదోన్నతులు కల్పించాలి

**తిరుపతిరూరల్, జనవరి 24 ప్రభాతవార్త:** ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గ్రామ రెవెన్యూ సహాయకులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేసారు. ఈమేరకు శుక్రవారం ఆర్డిఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేసారు. చిత్తూరు, తిరుపతి జిల్లాలలో గ్రామ సేవకులుగా రెవెన్యూ సేవలు అందిస్తున్న విఆర్ఏలకు సీనియార్టీ ప్రకారం అటెండర్, వాచ్మెన్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్ పోస్టులలో భర్తీ చేయాలని కోరారు. గ్రామ రెవెన్యూ సేవకులు చాలీచాలని జీతాలతో జీవితాలు గడుతున్నారని విఆర్ఏలు ఆవేదన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో సాంబ, బాల, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపిలో వన్నెకులానికి ప్రత్యేక స్థానం : ఉమేష్‌రావు

**శ్రీకాళహస్తి, జనవరి 24 ప్రభాతవార్త :**




స్వర్గీయ నందమూరి తారకరామారావు చేతులమీదుగా పురుడు పోసుకున్న తెలుగుదేశం పార్టీలో వన్నెకులక్షత్రియులకు ప్రత్యేక స్థానం ఉందని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్‌రావు కొనియాడారు. శుక్రవారం విజయవాడలోని గొల్లపూడిలోని బిసి సంక్షేమ భవన్‌లో వన్నెకుల క్షత్రియ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్లుగా ప్రమాణస్వీకారం చేసిన శ్రీకాళహస్తి చెందిన మిన్నల్‌రవి, చిన్నారెడ్డి మరియు తేజోవతిలతో పాటు ఛైర్మన్ సిఆర్.రాజన్‌లను ఉమేష్ ఆధ్వర్యంలో బిసి విభాగం నాయకులు దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు బుజ్జి, మునిరాజయాదవ్, కోటచంద్రశేఖర్, సునీల్, మణి, శివ, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఓటుహక్కు ప్రతిపౌరుని 'హక్కు'

**శ్రీకాళహస్తి/తొట్టంబేడు, జనవరి 24 ప్రభాతవార్త :** భారతీయ పౌరుడికి గుర్తింపునిచ్చేది ఓటుహక్కు. నేడు దేశంలో ఉన్న 18సంవత్సరాలు నిండిన యువతీయువకులందరికీ విధిగా ఓటుహక్కు కలిగి ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈనేపథ్యంలో ప్రతి ఏడాది జనవరి 25వతేది జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈసందర్భంగా కొత్తగాఓటరు నమోదు చేసుకోవాలను కునేవారు, ఓటరు జాబితాలో పేర్లు చేర్చుకోవడం కోసం 6ఎ ఫారంను నమోదుచేసి సమీపంలోని బిఎల్ఓకు అందించాలి. ఇక ఫారం-7లో పేర్లు తొలగించడంకు ఉపయోగించుకోవచ్చును. సాధారణ ఎన్నికలు, శాసనసభ ఎన్నికలు, పంచాయతీఎన్నికలకు సంబందించి ఓటరుకు ఖచ్చితంగా గుర్తింపు కార్డు ఉండాల్సిన అవసరం ఉంది.

## క్యాట్ ఒలింపియాడ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



**తొట్టంబేడు, జనవరి 24 ప్రభాతవార్త :** ఆలిండియా క్యాట్ ఒలింపియాడ్ పరీక్షల్లో స్థానిక తొట్టంబేడు మండలంలోని ధర్మరాజులస్వామి ఆలయం వద్ద ఉన్న శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ నిరోషా మాట్లాడుతూ 6,7 తరగతుల చిన్నారులు బి.లక్ష్మిన రసింహ, జి.సందీప్, ఓ.కార్తీకేయ, కె.శరణ్య, పి.యసో రాం, నగదు పురస్కారాలు గెలుచు కున్నారని వివరించారు. మరో 51మంది విద్యార్థులు ఎప్పుడూ అగ్రస్థానంలో నిలుస్తారని ఎజిఎం సురేష్ అభినందించారు. కార్యక్రమంలో డీన్ సురేంద్ర, ఇన్‌ఛార్జి రమేష్, క్యాట్ ఇన్‌ఛార్జి శ్యామల మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## పశు ఆరోగ్య శిబిరాల్లో రైతులకు లబ్ధి

**శ్రీకాళహస్తిరూరల్/తొట్టంబేడు, జనవరి 24 ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 20 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్న పశుఆరోగ్య శిబిరాల్లో తిరుపతి జిల్లాలోని 34 మండలాల్లో తొలి నాలుగు రోజు ల్లోనే 10186 మంది రైతులు సద్వినియోగం చేసుకున్నారని తిరుపతి డివిజన్ పశుసంవర్ధకశాఖ డిప్యూటీడైరెక్టర్ డాక్టర్‌డి.ఉమామహేశ్వర్‌అన్నారు. శ్రీకాళహస్తిలోనికాపుగున్నేరి, తొట్టంబేడు మండలంలోని చియ్యవరం గ్రామాలకు సందర్శించి శిబిరాలను ఆకస్మిక తనిఖీ చేశారు. చియ్యవరం గ్రామంలో పాడిరైతులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. శ్రీకాళహస్తి పశుసంవర్ధకశాఖడాక్టర్‌ఎన్.వి.శ్రీకాంత్‌బాబు, పశువైద్యాధికారులు డాక్టర్ ఉష, డాక్టర్‌రవీంద్రవర్మలు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో హంపీ పీఠాధిపతి



శ్రీకాళహస్తి,జనవరి 24 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయం శుక్రవారం సత్తెనపల్లి శాసనసభ్యుడు మాజీ మంత్రి కన్నాలక్ష్మీనారాయణ కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్ల దర్శనానికి రాగా ఆయనకు ఆలయ మర్యాదలతో ఇఓ టి.బాపిరెడ్డి, డెప్యూటీ ఇఓ.ఎన్.ఆర్.కృష్ణారెడ్డి దక్షిణ గోపుర వద్ద స్వాగతం పలికారు. ఆయనతో పాటు మాజీ గుంటూరు మేయర్ కన్నా నాగరాజు వారి కుటుంబసభ్యులు హాజరయ్యారు. ఆయనకు బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్, ఎం.సుబ్రమణ్యంరెడ్డి, డిల్లిబాబు, పిఆర్ఓ రవి,టెంపుల్ ఇన్స్పెక్టర్లు సుదర్శనం, హరియాదవ్, ఎస్ఓ నాగభూషణం యాదవ్‌లు పర్యవేక్షించారు.

**శివయ్య సేవలో హంపీ పీఠాధిపతి:**
వాయులింగేశ్వరుని సేవకు హంపీ పీఠాధిపతి విద్యారణ్యస్వామి వారి పరివారంతో దర్శించుకున్నారు. ఆయనకు డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి సారధ్యంలో స్వామి అమ్మవార్ల అంతరాలయంలో దర్శనం చేసుకున్న స్వామికి ఆలయమర్యాదలతో స్వామి తీర్థ ప్రసాదాలు అందించారు. పీఠాధిపతి ఆశీస్సుల కోసం భక్తులు ఎగబడ్డారు. వేదపండితులు జోషిశర్మ, త్రినాధ్,పిఆర్ఓ రవి స్వాగతం పలికారు.

## ప్రపంచ అంతర్జాతీయ చదరంగంలో గీతం విద్యార్థి ప్రతిభ



తిరుపతి విద్య, జనవరి 24 ప్రభాతవార్త: ప్రపంచ పాఠశాలల అంతర్జాతీయ చదరంగా ఛాంపియనన్స్ షిప్ పోటీలలో గీతం స్కూల్లో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థి కుమారి త్రిపురాంబిక అండర్ 13వ విభాగంలో తొమ్మిది రౌండ్ లలో 7.5.పాయింట్లలో ద్వితీయ స్థానంలో నిలిచి ట్రోపీను,నగదు బహుమతిని సాధించి అందరి ప్రశంసలను అందుకున్నది. మార్చి 19వ తేదీ నుంచి 20వ తారీకు వరకు షిర్బియా దేశంలో జరుగు ఫీడ్ ప్రపంచ పాఠశాలల చదరంగంలో పాల్గొనడానికి అర్హత సాధించి భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నందుకు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు అభినందించారు. ప్రిన్సిపాల్ కిన్నెర శ్రీదేవి మాట్లాడుతూ తమ విద్యార్థి త్రిపు రాంబిక ఇంటర్నేషనల్ 5నేషనల్ 70డిస్టిక్ 100 చదరంగ పోటీలలో పాల్గొని రేటింగ్ 1802లో ఉండడం హర్షనీయమని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్‌పర్సన్ పాలడగు విజయ,ఉపాధ్యాయులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

## నేడు గేట్ డిగ్రీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

తిరుపతి విద్య జనవరి 24 ప్రభాతవార్త: స్థానిక బావాని నగర్ సర్కిల్ నందు గల గేట్ డిగ్రీ కళాశాల నందు నేడు అనగా శనివారం ఉదయం ప్రముఖ ఎమ్ ఎన్ సి.కంపెనీ అయిన ఫస్ట్ సోర్స్ కస్టమర్ సర్వీస్ అసోసియేట్ ఉద్యోగాల కొరకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించడమైనదని కళాశాల చైర్మన్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఇందుకుగాను ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు.వివరాలకు9441434786,6281250110నెంబర్లనుసంప్రదించాల్సి ఉంటుందని తెలిపారు

## ఘనంగా కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ టాలెంట్ టెస్ట్



తిరుపతి,విద్య 24 జనవరి ప్రభాతవార్త : స్థానిక ఎల్.ఐ.సి.రోడ్డులో ఉన్న ఎమరాల్డ్స్ డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో అంబిషన్స్ కెరీర్ కౌన్సలర్స్, హైదరాబాద్, ఎమరాల్డ్స్ డిగ్రీ కాలేజ్‌ఆధ్వర్యంలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ టాలెంట్ టెస్ట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా, తిరుపతి పరిసర ప్రాంతాల నుంచి మొత్తం 300మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమరాల్డ్స్ డిగ్రీ కాలేజీ ఉపసంచాలకులు మునిరత్నం, అంబిషన్స్ డైరెక్టర్స్ సాయిరామ్ నాగారం, అర్జున్ బతిని విచ్చేసి విజేతలకు ప్రైజ్ మనీని అందజేశారు. ఉపసంచాలకులు మునిరత్నం మాట్లాడుతూ,ఇటువంటి టాలెంట్ టెస్టులు విద్యార్థులకు కెరీర్ అభివృద్ధిలో ఉపయోగపడతాయని తెలిపారు. అంబిషన్స్ డైరెక్టర్స్ మాట్లాడుతూ, విద్యార్థులకు సరైన దిశలో మార్గదర్శనాన్ని అందించడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విద్యార్థుల ప్రతిభను పరీక్షించేందుకు నిర్వహించిన ఈ టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు ప్రోత్సాహకరంగా మొత్తం 8 ప్రైజ్ మనీలు ప్రకటించారు.ఈ కార్యక్రమం లో ఎమరాల్డ్స్ డిగ్రీ కాలేజీ సిబ్బంది,విద్యార్థులకు పాల్గొన్నారు.

## సుబ్రమణ్యంను పరామర్శించిన మాజీ మంత్రి రోజా



నింద్ర,జనవరి 24 ప్రభాతవార్త : వైకాపా సినియార్ నాయకులు సుబ్రమణ్యం యాదవ్‌ను మాజీ మంత్రివర్యులు ఆర్‌కె రోజా శుక్రవారం పరామర్శించినారు. సుబ్రమణ్యం యాదవ్‌కి బైపాస్ సర్జరీ తిరుపతి అమర్ ఆసుపత్రిలో చికిత్స చేసుకొని ఇంటికి వచ్చిన వారిని మాజీ మంత్రివర్యులు ఆర్‌కె రోజా వారి వద్దకు వెళ్ళి వారి ఆరోగ్య విషయం గురించి అడిగి తెలుసుకొని ధైర్యం చెప్పినారు. ఈకార్యక్రమంలో మండల వైకాపా కన్వీనర్ వేణురాజు,యంపిపి దీపాజలంధర్ రాజు, కో ఆప్షన్ మెంబరు అనిల్,రాష్ట్ర వైకాపా యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్, నాయకులు బాబురెడ్డి, మునిక్రిష్ణారెడ్డి, సంపత్, తోయజాక్షి, మహేష్, సత్యరాజ్, రాము, మురళీ, బాలాజీ,గోపి,దామోదరం తదితరులు పాల్గొన్నారు.

## బాలికలు అన్ని రంగాలలో అబివృద్ధికి కృషి చేయాలి



నింద్ర,జనవరి 24 ప్రభాతవార్త : బాలికలు అన్ని రంగాలలో అభివృద్ధిలోకి రావడానికి కృషి చేయాలని ఆరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గిరిజావతి తెలిపారు.శుక్రవారం మండలంలోని ఆరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం ఐసిడియస్ సూపర్‌వైజర్ కె.శ్యామల ఆధ్వర్యంలోజరిగింది. ఈకార్యక్రమంలో అపరంజి రాజు,అంగన్‌వాడివర్కర్స్ పాల్గొన్నారు.

## పుత్తూరులో బాలికల దినోత్సవం



పుత్తూరురూరల్, జనవరి 24 ప్రభాతవార్త: మండలంలోని పిల్లారిపట్టు పాలిటెక్నిక్ కాలేజీలో, గోపాలకృష్ణాపురం గురుకుల పాఠశాలల్లో బాలికలకు బాలిక దినోత్సవ వేడుకలు నిర్వహించారు. బాలిక దినోత్సవం థీమ్ ఉజ్వల భవిష్యత్ కోసం బాలికలకు సాధికారత భాగంగా బాలికలకు వారి హక్కులు బాలికల సంరక్షణ ఆరోగ్యం విద్య సామాజిక ఎదుగుదల మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పుత్తూరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.గీతాంజలి, పి.సంధ్య, పోషణ అభియాన్ టాటా ట్రస్ట్ కో-ఆర్డినేటర్ సంతోషి, పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.వి.కుమార్, ఉపాధ్యాయులు మంజుల, జానకి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, వైస్‌ప్రిన్సిపాల్ చంద్రకళ, అంగన్‌వాడీ టీచర్లు భానుమతి, శ్రీదేవి, జ్యోతి, ధనమ్మ, సుమలత, సుమతి, ఆరోగ్యశాఖ సిబ్బంది, మహిళ సంరక్షణ కార్యదర్శి తేజస్విని, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి రోజా

విజయపురం, జనవరి 24 ప్రభాతవార్త: మండలంలోని విజయపురం దళితవాడ గ్రామంలో ఇటీవల మృతి చెందిన వైసీపీ కార్యకర్త నరసింహులు తల్లి మృతి చెందడంతో శుక్రవారం మాజీ మంత్రి రోజా ఆ గ్రామానికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఎల్ల సముద్రం గ్రామంలో వైసీపీ యువ నాయకుడు హరీష్ తండ్రి భూపాల్ చెన్నైలో ఓపెన్ హార్ట్ సర్జరీ పొంది విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను వారి స్వగృహంలో పరామర్శించి ఆరోగ్యపరిస్థితినిఅడిగి తెలుసుకున్నారు.పలువురువైసీపీనాయకులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

## నాధముని మృతి పార్టీకి తీరని లోటు



విజయపురం, జనవరి 24 ప్రభాతవార్త: మండలంలోని గంగమాంబాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గాలి జగదీష్‌నాయుడు మామ కంద్ర నాధమునినాయుడు అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతదేహానికి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు పార్లమెంట్ అధికారప్రతినిధి చినబాబు, మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు రమేష్‌రాజు, బాబుయాదవ్, నాయకులు శివలింగం, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను అరికడదాం

విజయపురం, జనవరి 24 ప్రభాతవార్త: బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి పిలుపునిచ్చారు. బాలిక దినోత్సవంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రమైన విజయపురంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అందరం కలసికట్టుగా లింగ అసమానతలను పూర్తిగా రూపుమాపదామని తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు జమున, జ్యోతి, భారతి, డిల్లీ, కళావతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## బాలికలే అన్ని రంగాల్లో మహారాణులు



రేణిగుంట జనవరి 24 ప్రభాతవార్త : బాలికలే అన్ని రంగాల్లో రాణిస్తున్నారని డిసిపిఓ శివ శంకర్ అన్నారు. రేణిగుంట బాలికల ప్లస్ టు ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాస్ స్వచ్ఛంద సేవ సంస్థ చైల్డ్ ఫండ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మిషన్ వాత్సల్య, సంయుక్తంగా ఆకాంక్ష స్వచ్ఛంద సేవ సంస్థ విడిగా జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బాలికలు ముందంజలో ఉన్నారన్నారు. కార్యక్రమాల్లో రాస్ బాలాజీ బాల వికాస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్ రెడ్డి, పాఠశాల ప్రధాన ఆచార్యులు విష్ణువర్ధని, శ్రీ సుసి సంక్షేమ శాఖ మిషన్ వాత్సల్య సిబ్బంది కల్పన, అనంతలక్ష్మి, వెంకటరమణ, రవికుమార్, రాస్ కోఆర్డినేటర్లు భారతి, శైలజ, నాగేంద్ర, మహిళా పోలీసులు పూర్ణిమ, నాగమణి, ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ మర్దాల రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

## లింగ వివక్షతపై ప్రభుత్వాలు కఠినంగా ఉన్నాయి



రేణిగుంట,జనవరి 24 ప్రభాతవార్త : లింగ వివక్షతపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరిస్తున్నాయని ప్రగతి సంస్థ డైరెక్టర్ కెవి. రమణ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం రేణిగుంట మండలం కరకంబాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికల ప్రాధాన్యతను గురించి వివరించారు. బాలికల హక్కుల సంరక్షణ కోసం ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ ఎల్లవేళలా కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు మురళి, ఐసిడిఎస్ సూపర్వైజర్ హేమావతి, ప్రగతి సంస్థ సి ఓ సురేష్, ప్రగతి జయలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, మహిళా పోలీసులు, పాఠశాల బోధన బోధ నేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆదేశాలతో బాగుపడుతున్న పార్కులు



రేణిగుంట, జనవరి 24 ప్రభాతవార్త : ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాలతో రేణిగుంటలో పలు ప్రాంతాలు అభివృద్ధి బాట పడుతున్నాయి. ఇప్పటికే రేణిగుంట సంత కొలిక్కి వచ్చింది. గురువారం రేణిగుంట వారపు సందులో ఎమ్మెల్యే చేతుల మీదుగా డ్రిల్లింగ్ పనులు ప్రారంభించిన బోర్ పాయింట్ నందు పుష్కలంగా నీరు వచ్చాయి. ఈ క్రమంలోని శుక్రవారం ఆయన ఆదేశాల మేరకు పంచాయితీ కార్యదర్శి మణి సిబ్బందితో బిస్మిల్లా నగర్ లోని పార్కులోని పిచ్చి మొక్కలను తొలగింపజేసి గడ్డిని క్రాఫ్ట్ చేయించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంలో నిమగ్నమయ్యారు. అతి త్వరలో వారపు సంతలో సిమెంట్ బెడ్లు, మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఉత్తమ సేవకు అవార్డు



నగరి, జనవరి 24 ప్రభాతవార్త: 2024 సార్వత్రిక ఎన్నికల్లో 6,7,8 క్లైములు సక్రమంగా అందించి ఉత్తమ సేవలందించినందుకు గాను విజయవాడ వేదికగా ఈ నెల 25న బెస్ట్ ఎలక్టరల్ ప్రాక్టీస్ అవార్డులను అందజేయనున్నారు. నగరి తహసీల్దార్ రవికుమార్‌కి అవార్డు దక్కింది. ఆ మేరకు ఆయన శనివారం విజయ వాడలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నారని తెలిపారు.

## మరుగుదొడ్లకు ఎంపి నిధులు



శ్రీకాళహస్తిరూరల్,జనవరి 24 ప్రభాతవార్త : ఏర్పేడు మండలంలోని పల్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికల మరుగుదొడ్లకు తిరుపతి ఎంపి గురుమూర్తి నిధులు మంజూరు చేసారు. శుక్రవారం ఈ నిధులతో మరుగుదొడ్లను నిర్మించుటకు భూమి పూజ కార్యక్రమాలను చేపట్టారు. ఈ పాఠశాలలో 180 మంది బాలికలు చదువుకుంటున్నారు. ఇక్కడ బాలికలకు సంబంధించి మరుగుదొడ్ల సమస్యను ఎంపి దృష్టికి ప్రధానోపాధ్యాయులు ఆనంద్ తీసుకెళ్ళి ప్రత్యేకంగా నిధులు కోరారు. స్పందించిన ఎంపి గురుమూర్తి రూ.5లక్షలు ఎంపిలాడ్స్ నుంచి కేటాయించి మంజూరు చేసారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల కమిటి మాజీ చైర్మెన్ చంద్రశేఖర్‌నాయుడు, రాజా, రమణయ్యానాయుడు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌పార్టీ కొత్తగా చేరుతున్న కార్యకర్తలు



శ్రీకాళహస్తి,జనవరి 24 ప్రభాతవార్త :శ్రీకాళహస్తిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి తలపా దామోదరంరెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీలో పలువురు చేరారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పార్టీకి జవసత్తాలు పెంచుటకు గ్రామీణ స్థాయి నుంచి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామీణ స్థాయిలో పార్టీని పటిష్టపరచి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానదాలపై పోరాటాలకు సిద్దం చేస్తున్నట్లు వివరించారు. ఈ నేపధనయంలో శ్రీకాళహస్తి మండలం జగ్గరాజుపల్లి గ్రామంలో యువకులు యానాది నవీన్, ముద్దమూడి గ్రామం నాయకులు మేకపిల్ల లోకేష్, ఎం.వెంకటేశ్వరరావు, పవనివారికండ్రిగ గ్రామ నాయకులు చింతా సుబ్రమణ్యం యాదవ్‌లకు పార్టీ కార్యాలయంలో తలపా దామోదర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీ సభ్యత్వంను అందించారు.

## మందుబాబులకు...రూ.70వేలు జరిమాన



శ్రీకాళహస్తి,జనవరి 24 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పరిధిలోని పోలీసుస్టేషన్ల పరిధిలో మందుబాబులపై పోలీసు నిఘా పెంచింది. ఈ నేపథ్యంలో మందు బాబులపై టూటౌన్ పోలీసులు పట్టుబిగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఏడుగురు మందుబాబులను అదుపులో తీసుకొని జరిమాన వసూలు చేసినట్లు సిఐ వెంకటేశ్వర్లు వివరించారు. ఈ నేపథ్యంలో ఏడు మందిని అదుపులో తీసుకొని రెండవ తరగతి క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా ఒక్కొక్కరి రూ.10వేల చొప్పున రూ.70వేలు జరిమాన విధించినట్లు సిఐ వివరించారు.

## మేరాజ్‌తో మనకు అల్లాహ్ ఇచ్చిన వరం నమాజు : రేహాన్



శ్రీకాళహస్తి,జనవరి 24 ప్రభాతవార్త : మహమ్మద్ ప్రవక్త రజ్జబ్ మాసంలో మేరాజ్ వెళ్ళారని ఆ సందర్భంగా అల్లాహ్ మనకు ఇచ్చిన మహావరం నమాజు అని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ వివరించారు.శుక్రవారం జామియా మస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల తరువాత ఇస్లాం మతంలోని రజ్జబ్,షాబాన్, రంజాన్ మాసాల ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ మూడు మాసాలు ఎంతో ప్రధానమైనవన్నారు. ఈ నెల 28న షబ్బేమేరాజ్ వస్తుందన్నారు. ఆరోజు రాత్రి సాధ్యామైనంత వరకు దైవ ప్రార్థనలో గడపాలని సూచించారు. గతంలో ముస్లింలు సుదీర్ఘమైన నమాజులు ఆచరించే వారన్నారు. పతి ఒక్కరు ఐదుపూటలా చిత్తశుద్దితో అల్లాహ్ ప్రార్థనలో గడపాలని జీవిత రహస్యాన్ని తెలుసుకోవాలని రేహాన్ పిలుపు నిచ్చారు.

## సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



శ్రీకాళహస్తి,జనవరి 24 ప్రభాతవార్త : నెల్లూరు నగరం వేదికగా ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు జరుగు 27వ సిపిఎం మహాసభలను జయప్రదం చేయాలని శుక్రవారం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పిలుపు నిచ్చారు. ఇక్కడి పుచ్చల పల్లి సుందరయ్య భవన్ సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు.ఈ సభకు ఆల్ ఇండియా పోలిట్‌బ్యూరో సభ్యులు ఎంఏ బేబీ,బివి రాఘవులు, బృందాకారత్ హాజరౌతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, ఏరియా కార్యదర్శి గంధం మణి, పెనగడం గురవయ్య, వెంకటేష్, వేలివేంద్రం, గురునాథం, చుట్టు గురవయ్య, సంక్రాంతి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు

## మాతాశిశు మరణాల నివారణే లక్ష్యం



శ్రీకాళహస్తి,జనవరి 24 ప్రభాతవార్త : మాతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా పని చేయాలని తిరుపతి జిల్లా టాస్క్‌ఫోర్సు టీం అధికారి డాక్టర్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో జిల్లా గణాంక అధికారి నాగేంద్రకుమార్, నరేష్,డిపిఓ ప్రకాష్ సారధ్యంలో పట్టణంలోని సాలిపేట ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో చైతన్య సదస్సు నిర్వహించారు. పిల్లలు గర్భవతులు బాలింతలకు రక్త హీనతతో మరణించరాదన్నారు. వారికి తగిన వైద్యసదుపాయాలు కల్పించి రక్తహీనత లేకుండా చూడాలని తగిన వైద్యసదుపాయాలు కల్పించాలని ప్రతి ఒక కాన్పు ఆసుపత్రిలోనే జరిగేటట్లు చర్యలు తీసుకోవాన్నారు.ఈ సందర్భంగా అధికారులు ఎఎన్ఎంల రికార్డులను పరిశీలించి సూచనలు చేసారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక ఆసుపత్రి ఇన్‌చార్జి సూపర్‌వైజర్ పి.నరేష్, డాక్టర్లు స్రవంతి నయనార్, బాలాహుస్సేని, సిఓ రేవతి, ఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్


## మన మధ్య ఐక్యత లేకనే అభాసుపాలు

-అంతర్మథనంలో గాంధీపురం టిడిపి నాయకులు



తిరుపతిరూరల్, జనవరి24 ప్రభాతవార్త: మనందరి మధ్య ఐక్యత లేకనే అభాసుపాలు అవుతున్నామని, అందరం ఐక్యంగా ఉన్నప్పుడే గ్రామ పంచాయతీ అభివృద్ధిలో భాగస్వామ్యం కాగలమని గాంధీపురం గ్రామ పంచాయతీ కూటమి నాయకులు చర్చించుకున్నారు. శుక్రవారం గాంధీపురం గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన సుజాతకు శుభాకాంక్షలు తెలపటానికి వచ్చిన, కూటమి నాయకులు వారిలో వారు చర్చించుకున్నారు. ఎన్ని సమస్యలు వచ్చిన ఒకరిపై మరొకరు ఆరోఫణలు చేసుకోవడం మానుకోవాలని, ఏ ఒక్కరిపై ఆరోఫణ వచ్చిన అందరూ కలిసి సామరస్యంగా పరిష్కరించుకుందా మనుకు న్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావటానికి మనందరం కష్టపడ్డామని, బయట వ్యక్తులు వచ్చి పంచాయతీలో పెత్తనం చలాయిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గాంధీపురం గ్రామ పంచాయతీ టిడిపి అధ్యక్షుడు ధనంజయరాయల్, ఎలుకా ధనంజయ యాదవ్, రమేష్, చల్లా శ్రీనివాసులు, కలకడ క్రిష్ణయ్య, సాగర్, పురంధర్‌నాయుడులు పాల్గొన్నారు.

## డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయండి



పాకాల, జనవరి 24 ప్రభాతవార్త: పాకాల మండలం కేంద్రం లోని ప్రభుత్వ ప్రధమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ఒక డయాలసిస్ వార్డు ఏర్పాటు చేయ వలసినదిగా, అలాగే విడిగా సిబ్బందిని నియమించాలని ప్రజల నుంచి పెద్ద ఎత్తున విజ్ఞప్తిలు వస్తున్నాయి. ఇప్పటికే మండలంలో దాదాపు 15 మంది నుంచి 25మంది వరకు డయాలసిస్ పేషెంట్లు ఉన్నట్టుగా ప్రభుత్వ వైద్య అధికారుల నుంచి అందిన ప్రాథమిక సమాచారం. పాకాల మండలం, చుట్టుపక్కల నుంచి నిత్యం కిడ్నీ బాధిత రోగులు డయాలసిస్ కొరకు తిరుపతి, చిత్తూరు, పీలేరుకి వెళ్ళవలసి రావటం వైద్య ఖర్చులు పేద మధ్య తరగతి వారు భరించలేక ఇప్పటికే చాలా మంది ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి ప్రస్తుతం మండలంలో వుంది. కిడ్నీ రోగులు వారి బంధువులు దూర భారం వెళ్లలేక ఇబ్బంది నిత్యం పడుతున్నారు.

## బాలికలు అన్ని రంగాలలో ముందుండాలి



కార్వేటినగరం,జనవరి 25 ప్రభాతవార్త: బాలికలు అన్నరంగాల్లో ముందుండాలి కార్వేటినగరం ఐసిడియస్ ప్రాజెక్టు సిడిపిఓ పద్మసునంద అన్నారు. కార్వేటి నగరం జడ్‌పి.హైస్కూల్లో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికలు వివక్షతకు గురి కాకుండా చక్కగా విద్యనభ్యసించాలన్నారు. విద్య ద్వారానే మంచి బంగారుభవిష్యత్తు నిర్మించుకోవచ్చన్నారు. తమ హక్కులను వినియోగించుకోవడంలో తోటి బాలికల సహకారం పొందాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి,పాఠశాల సిబ్బంది, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు,విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

## సారా స్వాధీనం-ఊటధ్వంసం



కార్వేటినగరం,జనవరి 24 ప్రభాతవార్త: యస్.ఆర్.పురం మండలం చిన్నతయ్యూరు అటవీ ప్రాంతంలోని పెద్దకాలువ వంకలో నాటుసారా తయారీకి సంబంధించిన ఊటను సుమారు 1200లీటర్ల ఊటను ధ్వంసం చేసి 40లీటర్ల సారాను సీజ్ చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్స్‌పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. సీజ్ చేసిన సారాని కార్వేటినగరం ఎక్సైజ్ స్టేషన్‌కి అప్పగించినట్లు తెలిపారు. దాడుల్లో హెడ కానిస్టేబుల్‌టి.మునిసుందరం,రామచంద్రయ్య,సురేంద్రబాబు,విజయకుమార్,గీత,పాల్గొన్నారు.

## మామిడి సస్యరక్షణపై రైతులకు శిక్షణ



చంద్రగిరి, జనవరి 24 ప్రభాతవార్త: మామిడి పంట సస్యరక్షణపై శుక్రవారం ఏ.రంగంపేటలో రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా ఉద్యానవన అధికారి ధశరధరామిరెడ్డి మాట్లాడుతూ మామిడి పంటలో డిశంబర్, జనవరి నెలలో కురిసిన వర్షాలకు, పగలు, రాత్రిపూట ఉష్ణోగ్రత వ్యత్యాసాల కారణంగా పూతరావడానికి అనుకూలంగా లేదన్నారు. సరైన యాజమాన్యపద్ధతులు పాటించకపోవడం, ఎరువులు సరైన మోతాదులో చెట్లకు అందించకపోవడంతో పూత ఆశించిన మేరకు రాలేదన్నారు. ఎరువులను పద్దతి ప్రకారం ఉపయోగించడం వలన నిద్రావస్థలో వున్న మొగ్గ, పూమొగ్గగా మారే అవకాశం ఎక్కువ శాతం వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రయ్య, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపండి : ఎంపిపి

రామచంద్రాపురం, జనవరి 24 ప్రభాతవార్త:



పల్లెల్లో పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపిపి ఎవి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ ఇందిర అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. అధికారులకు తమ శాఖల ప్రగతి నివేధికలను సభకు చదివివినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పల్లెల్లో మంచినీటి సమస్య వున్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. విషజ్వరాలు ప్రబలకుండా వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జడ్పీటీసి ఢిల్లీరాణి భానుకుమార్ రెడ్డి, తహాశీల్దార్ వెంకటరమణ , ఎంపిటిసిలు జ్ఞానమ్మ, మంజుల సిద్దారెడ్డి, సర్పంచ్‌లు మురగయ్య, హిమాల్ రెడ్డి, శాంబ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## మా భూములు మాకు ఇప్పించండి..!



రామచంద్రాపురం, జనవరి 24 ప్రభాతవార్త: పూర్వీకుల నుండి తమకు వంశ పార్యంపర్యంగా వస్తున్న భూములను తమకు ఇప్పించాలని తహశీల్దార్ వెంకటరమణకు శుక్రవారం గంగిరెడ్డి పల్లి దళితులు వినతి పత్రం అందజేశారు. తమకు గంగిరెడ్డిపల్లి రెవెన్యూ లెక్కదాఖలా సరే నంబర్ 8/1లో 4.76 ఎకరాలు వ్యవసాయ భూమి వుందన్నారు. సదరు భూమిని గ్రామాకి చెందిన ఓ వ్యక్తి విక్రయించడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. తమ భూమిని తమకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

## బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



పాకాల, జనవరి 24 ప్రభాతవార్త : బాలికలు అన్ని రంగాల్లో రాణించి తమ భవిష్యత్తును చక్కగా తీర్చిదిద్దుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచ్యాలు డా. మొహిద్దీన్ బాషా సూచించారు. శుక్రవారం కళాశాలల మహిళా విభాగం ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. మహిళా విభాగం సమన్వయకర్త మాధవి అమ్మాయిలు సమాజంలో ఎదుర్కొంటున్న వివిధ రకాల వివక్ష, దోపిడీల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో చిట్టి కళావతి అధ్యాపకులు రేఖ, విష్ణు ప్రియ, మాధవి, నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ట్రాన్స్ఫార్మర్లపై దొంగలు పడ్డారు

పాకాల, జనవరి 24 ప్రభాతవార్త :పాకాల మండల కేంద్రంలోని చిత్తూరు తిరుపతి నేంద్రకుంట హైవే ఎన్ హెచ్140 శంకంపల్లి వద్ద వ్యవసాయ బోర్లకు కరెంటు సరఫరా చేసే త్రిఫేస్ ట్రాన్స్ఫార్మర్లే లక్ష్యంగా కొంత మంది దొంగలు చెలరేగిపోయి ట్రాన్స్ఫార్మర్లు బద్దలు కొట్టి అందులో ఉన్న కాపర్ వైర్ దొంగలించుకుని పోయారు. శుక్రవారం ఉదయం రైతు తమ పొలం వద్దకు వెళ్లి బోర్ మోటార్ ఆన్ చేసి కరెంటు రాలేదని గుర్తించగా ట్రాన్స్ఫార్మర్ బద్దలు కొట్టిన విషయం తెలిసి వెంటనే విద్యుత్ ఉన్నతాధికారులకు సమాచారం అందించగా తదుపరి అన్నదాతలు పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేశారు. రైతులు సమస్యకు పరిష్కారం చూపవలసినదిగా అన్నదాతలు విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నారు.

## కేవీబీ పురంలో బాలికల దినోత్సవం

కేవీబీ పురం, జనవరి 24 ప్రభాతవార్త: మండలంలోని కేవీబీ పురం, రాగిగుంట ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ప్రజాప్రగతి సంస్థ ఆధ్వర్యంలో రాగి గుంట హైస్కూలులో, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో, చెంచు రామిరెడ్డి ప్రజా ప్రగతి ట్రస్టు సిబ్బంది జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ప్రజా ప్రగతి ట్రస్టు పోగ్రాం కో-ఆర్డినేటర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఆడపిల్ల భవిష్యత్ సమాజంలో జరిగే వివిధ దురాచారాల వల్ల, బాల్య వివాహాల వల్ల అంతమవుకూడదని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం మోహన్‌బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ప్రజాప్రగతి ట్రస్టు సిబ్బంది, చంద్రశేఖర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

